క్లుప్తంగా

ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి



నిర్మానుష్యంగా ఉన్న కె.జె.పురంలో ఓ వీధి

మాడుగుల రూరల్: వేసవి ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీంతో ఉపాధి కూలీలు, వ్యవసాయ దారులు ఉదయం 10.30 గంటలకు తమ పనులు ముగించుకుని ఒంటికి చేరుకుంటున్నారు. ఆదివారం భానుడు తన ప్రతాపం చూపాడు. ఎండ తీవ్రతతో ప్రజలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రాలేదు.

ఎ.కోడూరు రక్తదాన, నేత్ర వైద్య శిబిరాలు



రక్తదానం చేస్తున్న యువకులు

కె.కోటపాడు : ఎ.కోడూరు హైస్కూల్‌లో ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. ఎ.కోడూరుతో పాటు పరిసర గ్రామాలకు చెందిన యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, ట్రస్ట్ చైర్మన్ జి.వెంకటరావు, సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, లెక్కల కోటి పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



మాట్లాడుతున్న డాక్టర్ గోపాలరావు

నర్సీపట్నం: మున్సిపల్ స్టేడియంలో సమ్మర్ క్యాంపులో స్పోర్ట్స్‌లో ఉచిత శిక్షణ పొందుతున్న చిన్నారులకు ఆదివారం డాక్టర్ అధికారి గోపాలరావు, విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకులు నారాయణ మూర్తి, కూరసా చిట్టిబాబు పౌష్టికాహారం అందజేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డాక్టర్ గోపాలరావు చిన్నారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నింజాస్ అకాడమీ డైరెక్టర్ వెలగా నారాయణ, సీనియర్ కోచ్ ఎర్ర శేఖర్ పాల్గొన్నారు.


సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

నర్సీపట్నం: అనారోగ్యంతో బాధపడుతున్న మాకవరపాలెం మండలం, పాపయ్యపాలెం గ్రామానికి చెందిన కసిరెడ్డి రామలక్ష్మికి రూ.3,69,432 చెక్కును స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక సహాయంగా సీఎం సహాయనిధి నిరంతరం అందుబాటులో ఉంటుందని స్పీకర్ పేర్కొన్నారు. పార్టీ నాయకుడు యర్రాపాత్రుడు, సర్పంచ్ అల్లునాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

చీడికాడ: చీడికాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరం జరగనున్నట్టు గ్రంథాలయాధికారి ఎం.జోగేశ్వరి తెలిపారు. ఈ శిబిరం జూన్ 6వ తేదీతో ముగుస్తుందన్నారు. విద్యార్థులకు కథలు, డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, యువతీ, యువకులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు రావాలని ఆమె కోరారు.

మంచినీటి ట్యాపులకు మరమ్మతులు



కె.జె.పురం కైలాసవాటిక వద్ద మరమ్మతులు చేపట్టిన ట్యాపులు

మాడుగుల రూరల్: కె.జె.పురం కైలాసవాటిక వద్ద ఉన్న మంచి నీటి ట్యాపులకు దాతలు సహకారంతో ఆదివారం మరమ్మతులు చేపట్టారు. గ్రామానికి చెందిన పుట్టా చిన్ని, రవి సహకారంతో ట్యాపులు బాగు చేయడంతో పాటు వాచ్‌మన్ గదికి, గేటు, లోపలి గదిలో టైల్స్, పెయింటింగ్ వేయించారు. దాతలను స్థానిక సంతోషి మాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు అభినందించారు.



జలపాతానికి వెళ్లే మార్గంలో తాటి దుంగలతో గిరిజనులు ఏర్పాటు చేసిన ముఖద్వారం



తుప్పలతో నిండి ఉన్న జలపాతానికి వెళ్లే ప్రధాన రోడ్డు



శిథిలావస్థలో దుస్తులు మార్చుకునే షెడ్డు



జలపాతానికి వెళ్లాలంటే ఈ గెడ్డ దాటాల్సిందే

సరుగుడులో సౌకర్యాలు కరువు



ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి ప్రవహిస్తున్న జలపాతం

- సరుగుడు జలపాతానికి మట్టి రోడ్డే దిక్కు
- రెండు జిల్లాల నుంచి సందర్శకుల తాకిడి
- ఆహ్లాదాన్నిచ్చే ప్రాంతాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వం

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద సౌకర్యాలు కరువయ్యాయి. ఎత్తైన రెండు కొండలు మధ్యలోంచి ప్రవహించే జలపాతాన్ని చూసేందుకు ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు తరలివస్తున్నా ఆ స్థాయిలో వసతులు కానరావడం లేదు. జలపాతాన్ని చేరుకోవడానికి సరైన రోడ్డు సదుపాయం సైతం లేదు. మట్టి రోడ్డులో గెడ్డలు దాటుకుంటూ వెళ్లాల్సిందే. సరుగుడు నుంచి సుందరకోట గ్రామానికి వెళ్లే వరకు తారురోడ్డు నిర్మించారు. ఈ జలపాతం సరుగుడు, సుందరకోట గ్రామాల మధ్యలో అటవీ ప్రాంతంలో ఎత్తైన కొండల మధ్య ఉంది. సుందరకోట గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో కుడి వైపు నుంచి జలపాతానికి వెళ్లాలి. అక్కడ్నుంచి పూర్తిగా గుంతలతో కూడిన మట్టి రోడ్డు కావడంతో ఏమాత్రం వర్షం పడినా బురదమయంగా తయారవుతోంది. మధ్యలో గెడ్డలో నిత్యం ప్రవహించే నీటిలో దాటుకుంటూ సందర్శకులు వెళ్తుంటారు. జలపాతానికి వెళ్లడానికి సందర్శకులు రూటు తెలియక తికమక పడుతుంటే గిరిజనులు తాటి దుంగలతో ముఖద్వారం ఏర్పాటు చేశారు. జలపాతం వద్ద స్నానాలు చేసి దుస్తులు మార్చుకోవడానికి నిర్మించిన షెడ్డు పూర్తిగా శిథిలమై కూలిపోయేలా ఉంది. దీంతో చెట్ల మాటున మహిళలు దుస్తులు మార్చుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. జలపాతం దిగువ భాగంలో సందర్శకులకు ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్ శిథిలమై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో పర్యాటక శాఖ అధికారులు రూ.10 లక్షలతో నిర్మించిన షెడ్డు నిర్వహణ లేక అధ్వానంగా తయారైంది. జలపాతాన్ని ఉన్న ప్రాంతాన్ని పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే గిరిజన ప్రాంతం అభ్యున్నతికి దోహదపడుతుందని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పీకరు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం

డిసెంబరు 24న స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు సరుగుడు మీదుగా సుందరకోటకు వెళ్లారు. ఆ సమయంలో సరుగుడు, సుందరకోట పంచాయతీలకు చెందిన 16 గ్రామాలు గిరిజనులు ప్రధానంగా జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఆ మేరకు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని స్పీకర్ హామీ కూడా ఇచ్చారు. అయినా ఇప్పటికీ అతీగతీ లేదు.

అభివృద్ధి చేస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు



జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే మా గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. స్థానికంగా గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఎంతో ఆశపడుతున్నాం. మా ప్రాంత గిరిజనులు కోరిక మేరకు సుందరకోటలో జరిగిన సభలో ఈ విషయాన్ని స్పీకరు దృష్టికి తీసుకెళ్లాను. పర్యాటక కేంద్రంగా చేస్తే అనంతగిరి, లంబసింగి మాదిరిగా సందర్శకులు వస్తారు.

– సాగిన లక్ష్మణమూర్తి, నాతవరం ఎంపీపీ

దుర్గాలమ్మకు బోనాలు సమర్పణ



మాకవరపాలెంలో దుర్గాలమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మాకవరపాలెం: మండల కేంద్రం మాకవరపాలెంలో దుర్గాలమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా గంధ అమావాస్య రోజున ఈ పండగను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు సచివాలయం పక్కనే ఉన్న దుర్గాలమ్మ ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి సారె, బోనాలు గ్రామంలో ఊరేగించిన అనంతరం అమ్మవారికి సమర్పించారు.

‘రోడ్ల సౌకర్యం లేక డోలీ మోతలే శరణ్యం’



దేవరాపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకన్న

దేవరాపల్లి: గిరిజన గ్రామాల్లో డోలీ మోతలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. దేవరాపల్లిలో ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం, పవన్ కల్యాణ్‌ను నమ్మి ఓట్లేసిన గిరిజన ప్రజలు ఘోరంగా మోసపోయారన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు సౌకర్యం కల్పిస్తామన్న వాగ్దానాలు నెరవేరలేదని ఆరోపించారు. జిల్లాలోని మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, రోలుగుంట, రావికమతం, గొలుగొండ తదితర మండలాల్లోని నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు నేటికీ తప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజులు క్రితం అవురువాడ పంచాయతీ పశువులబందకు చెందిన ఏడేళ్ల సీదిరి కొండలరావును 6 కి.మీ మేర డోలీ మోతలో కొత్తకోట ఆస్పత్రికి తరలించారన్నారు. రెండు రోజుల క్రితం రోలుగుంట మండలం అర్ల పంచాయతీ పరిధి నీలబందలో తొమ్మిదేళ్ల గమ్మెల సింహాద్రిని డోలీ మోతలో 5 కిలోమీటర్ల మేర ప్రయాణించి రావికమతం ఆస్పత్రికి తీసుకెళ్లారని చెప్పారు. గిరిజనులు తమ ప్రాణాలు కాపాడుకునేందుకు డోలీ మోతలే శరణ్యమవుతున్నాయన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించడంపై కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మంజూరైన పలు రోడ్ల నిర్మాణాలు ప్రస్తుతం అసంపూర్తిగా నిలిచిపోయాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజనుల డోలీ మోతల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతల పండగ



వెన్నలపాలెంలో మర్రిచెట్టు నీడలో నిర్మించిన తలుపులమ్మ తల్లి ఆలయం



కె.జె.పురంలో మోదమాంబ ఘటాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

నాతవరం: మండలంలో పలు గ్రామాల్లో గ్రామ దేవతల పండగలు భక్తులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. మర్రిపాలెం, వెన్నలపాలెం, ఎం.పంచాయతీ శివారు ములగపూడి గ్రామాల్లో శ్రీతలుపులమ్మ పండగను, సిద్దిపట్నం, కొత్త ఎల్లవరం గ్రామాల్లో శ్రీకోటసంతానమ్మ తల్లి పండగను, వై.బి.అగ్రహారంలో శ్రీమైసమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మర్రిపాలెం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మాడుగుల రూరల్: గ్రామాల్లో గ్రామ దేవతలు ఒడ్డు పండగలు ఆదివారం ఘనంగా జరిగాయి. కె.జె.పురం గ్రామంలో భీశెట్టి అచ్చిమినాయుడు, అప్పలనర్సమ్మ కుటుంబ సభ్యుల సారథ్యంలో మోదమాంబకు ఒడ్డు పండగ నిర్వహించారు. గ్రామం నుంచి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఎం.కోడూరు మోదమాంబ ఆలయం వద్ద ఒడ్డు పండగలు నిర్వహించారు. సాగరం, సురవరం, ఎం.కోటపాడు తదితర గ్రామాల్లో ఒడ్డు పండగ చేశారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలోని నూకాంబిక అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. రాత్రికి భజన కార్యక్రమం అలరించింది.

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఎంతో ఉల్లాసంగా సాగింది. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 2003–04 ఏడాదిలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం తమ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులంతా హాజరై 20 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఒకరికి ఒకరు యోగ క్షేమాలతో పాటు ప్రస్తుతం ఏయే రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన 20 మంది గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సమ్మేళనంలో సుమారు 120 మందికిపైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై పెల్లుబికిన నిరసనలు



మాడుగులలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు, గ్రామపెద్దలు



వడ్డాదిలో కొవ్వొత్తులతో ర్యాలీ



చోడవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మానవహక్కుల కౌన్సిల్ ప్రతినిధులు

మాడుగుల రూరల్: కశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ మృతులకు సంతాపంగా మాడుగుల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మాడుగులలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా యూనియన్ పిలుపు మేరకు మాడుగుల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రొబ్బా శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గసభ్యుడు ఏలూరు సురేష్, స్థానిక సర్పంచ్ యడ్ల కళావతి, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్, గాంధీ విగ్రహాల వద్దకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు.

బుచ్చియ్యపేట : పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆదివారం రాత్రి వడ్డాదిలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మానహారంగా ఏర్పడి ఉగ్రవాదులుకు సహకరిస్తున్న పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వివిధ పార్టీల నేతలు, అమ్మా హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు, పాత్రికేయులు,ఎన్జీవో ప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.


చోడవరం: ఉగ్రవాదుల దాడులు పాక్ దుశ్చర్యే అని నినాదాలు చేస్తూ చోడవరం మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు నిరసన ర్యాలీ చేశారు. ఇటీవల పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి పలువురు పర్యాటకులను చంపిన ఘటనను ఖండిస్తూ చోడవరం మెయిన్‌రోడ్డులో కొవ్వొత్తులతో ఆదివారం రాత్రి ర్యాలీ చేశారు. దాడిలో మృతిచెందిన వారికి ఈ సందర్భంగా నివాళులర్పించారు. ఉగ్రవాదం నశించాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. చోడవరం విఘ్నేశ్వర స్వామి ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్లి కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధులు దేవరపల్లి నవకుమార్, మైచర్ల శ్రీనివాసరావు, జంపా ఈశ్వరరావు, జోగ తరుణ్, సింగంపల్లి చంద్రశేఖర్, పి.అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

26వ వార్డులో క్షీణించిన పారిశుధ్యం



కాలువలో పూడిక తొలగించుకుంటున్న మహిళ

నర్సీపట్నం: మున్సిపాలిటీ 26వ వార్డులో పారిశుధ్యం క్షీణించింది. కాలువల్లో మురుగు తొలగించాల్సిన మున్సిపల్ సిబ్బంది ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ వస్తువులతో కాలువలు నిండిపోయి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. వార్డు ప్రజలే స్వచ్ఛందంగా తమ ఇళ్ల ముందున్న కాలువల్లో పూడికను తొలగించుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. పూడిక తొలగించకపోవడంతో కంపు భరించలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వార్డులోని మురుగు కాలువ పరిస్థితి

అంబేడ్కర్, పూలే ఆశయాల సాధనే లక్ష్యం



చోడవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

చోడవరం: అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలే ఆశయాల సాధనకు యువత పని చేయాలని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ అన్నారు. అంబేడ్కర్, జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను పురస్కరించుకుని చోడవరం ప్రేమ సమాజంలో ఆదివారం సామాజిక చైతన్య సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ భవనం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రేమ సమాజం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాజ్యాంగంలో అందరికీ సముచిత స్థానం కల్పించినప్పటికీ నేటికీ దళితులను అణిచివేసే ధోరణి కొనసాగుతుందన్నారు. దళితులంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు ఎప్పటికప్పుడు పోరాటాలు చేయాలని ఆయన పిలుపుఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల సంఘాల ప్రతినిధులు కొరివి సుందరరావు, కొత్తపల్లి వెంకటరమణ, జీడి సారయ్య, ఎం.ఎస్.బుద్ధ, నడుపూరి దేముడు, బి.సన్యాసమ్మ, బి.అప్పారావు, పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ టీం సభ్యులతో గ్రామ పెద్దలు

రావికమతం: మండల కేంద్రంలో రావికమతం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సర్పంచ్ గెంజి మంగ మోదినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వేపాడ నాగేశ్వరరావు, గొంప ఎంపీటీసీ సభ్యుడు గెంజి సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గంటా ఈశ్వరరావు, హైస్కూల్ కమిటీ చైర్మన్ బూసాల అప్పారావు ప్రారంభించారు. రావికమతం, బుచ్చియ్యపేట, మాడుగుల మండలాలకు చెందిన 9 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఎం.కోటపాడులో ట్రాఫిక్ జామ్



ఎం.కోటపాడు వద్ద ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు

మాడుగుల రూరల్: తాటిపర్తి నుంచి వడ్డాది వరకు జరుగుతున్న రహదారి నిర్మాణంలో భాగంగా ఎం.కోటపాడు గ్రామం వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలు ట్రాఫిక్ జామ్‌తో చిక్కుకుంటున్నాయి. ఎం.కోటపాడు, వల్లాపురం గ్రామాల వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇరువైపులా రోడ్డు నిర్మాణం జరుగుతుంది. తాజాగా ఆదివారం ఒక వైపు వేసిన సిమెంటు రోడ్డు మీద నుంచి వాహనాలు వెళ్లడంతో స్థానికులు ఆగ్రహించి, వడ్డాది నుంచి పాడేరు, మాడుగుల వైపు వాహనాలు, పాడేరు, మాడుగుల నుంచి వడ్డాది వైపు వెళ్లే వాహనాలను నిలుపుదల చేశారు. దీంతో ఘాట్ రోడ్డు జంక్షన్ నుంచి కె.జె.పురం కూడలి సమీపంలో బాలోజు బంగ్లా వరకు రహదారి కిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దూర ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. రాత్రి 9 గంటల తర్వాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రతి రోజు ఇలా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.